## క్లుప్తంగా

### ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి



బాలింతలతో మాట్లాడుతున్న హేమలత

ఆదోనిటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని రాష్ట్రీయ బాలస్వాస్థ అధికారిణి హేమలత సూచించారు. ప్రసవాల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్ట పోవద్దని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అన్ని వసతులు, అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. శనివారం ఏరియా ఆస్పత్రిలో అసిస్టెంట్ ఇంజినీర్ ఆంజనేయులతో కలిసి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పర్యవేక్షించారు. అలాగే మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. బాలింతలు, బిడ్డల ఆరోగ్యం, వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవీలతను కలిసి ఆస్పత్రిలో సాధారణ కాన్పులు, సీజేరియన్ కాన్పులు ఏ మేరకు జరుగుతున్నాయో ఆరా తీశారు.డీఈఐసీ మేనేజర్ ఇర్ఫాన్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ రాజేష్, సుధాకర్, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

### 22న మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22వ తేదీన ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒక సారి జరిగే మండల సర్వ సభ్య సమావేశంలో మండలంలోని జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి మండలంలోని అని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

### పాఠశాలలకు వంట పాత్రలు సరఫరా

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం నూతన మెనూ అమలు చేస్తుంది. వంటలు చేయడానికి నిర్వాహకులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వమే వంటకు అవసరమైన పాత్రలను ఆయా పాఠశాలలకు అందజేసింది. అలాగే రాగిజావ తాగడానికి గ్లాసును అందజేసింది. విద్యార్థుల సంఖ్యను బట్టి వంట సామగ్రిని పంపిణీ చేసినట్లు అర్అర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాల హెచ్ఎం రమేష్ నాయుడు తెలిపారు.

### పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి

కౌతాళం: పౌష్టికాహారంతో రోగులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి మనోజ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం అందించిన పౌష్టికాహార కిట్లను శనివారం రోగులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోగులు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం మూడు కిలోల రాగి పిండి, రెండు కిలోల కంది బ్యాళ్లు, ఒక కిలో వేరుశనగ విత్తనాలతో పాటు 300 మి.మీ. పామాయిల్‌ను అందజేస్తుందని వివరించారు. మండలంలో మొత్తం 94 కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

### ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం: ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. శనివారం మండలంలోని బూదూరు గ్రామంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజుతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో నడుచుకోవాలని చెప్పారు. ఎవరైనా అనుమానంగా కన్పిస్తే వెంటనే డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు.

### నష్ట పరిహారం చెల్లించాలి

ఆదోనిరూరల్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలను సాగుచేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవిశెట్టి ప్రకాష్, జిల్లా మైనార్టీ చైర్మన్ ఎండీ నూర్ కోరారు. శనివారం మండలంలో కరువు పరిస్థితులు, ప్రజా సమస్యలపై కార్యకర్తలతో స్థానిక పార్టీ కార్యాలయంలో చర్చించారు. వారు మాట్లాడుతూ మండలంలో 40 గ్రామాల్లో వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయాయన్నారు. పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బి.హనుమంతు, నెట్టేకల్ నాగరాజు, కుప్పగల్ అయ్యప్ప, కల్లుబావి రామన్న, బల్లేకల్ నరసయ్య, దొడ్డనకేరి లక్ష్మన్న పాల్గొన్నారు.

### వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షణకు బిగ్ స్క్రీన్

ఆదోనిఅర్బన్: వరల్డ్‌కప్ ఫైనల్ సందర్భంగా ఆదివారం భారత్–ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఫైనల్ మ్యాచ్ కోసం మధ్యాహ్నం పట్టణవాసులు వీక్షించేందుకు మున్సిపల్ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత, జయమనోజ్‌రెడ్డి బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేయిస్తున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ భారత్ ఫైనల్‌కు రావడంతో ఫైనల్‌లో కూడా మన జట్టు విజయం సాధించాలని ప్రజలు ప్రార్థనలు చేస్తున్నారన్నారు.

---

- కులాలవారీగా జనగణనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- ప్రత్యేక యాప్, వలంటీర్ల ద్వారా సర్వే
- ఏళ్లుగా కొనసాగుతున్న డిమాండ్‌కు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న కుల సంఘాలు

# కులగణన..కార్యాచరణ



ఆదోనిఅర్బన్ : కులాల వారీగా జనగణన నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కులగణన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు కార్యరూపంలోకి తీసుకొచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 15వ తేదీ నుంచే రాష్ట్రంలో కులాల వారీగా జనగణనకు సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల సర్వే చేపట్టనున్నారు. ఇందుకు ప్రత్యేక యాప్ రూపొందించనున్నారు. ఒక్కో వలంటీర్‌కు వంద ఇళ్లను కేటాయించి పూర్తి వివరాలను సేకరిస్తారు. దీనిపై ఆయా కుల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చాలాకాలంగా కులగణన చేపట్టాలనే డిమాండ్ కొనసాగుతోంది. దీనిపై సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించి ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారు. గతంలో 1931లో, 1941లో మాత్రమే కులగణన జరిగింది. మళ్లీ ఇప్పుడు చేపట్టనున్నారు. సీఎం నిర్ణయంపై 139 కులాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**పక్కా లెక్కలతో....**

కులాలవారీగా సమగ్ర లెక్కలు లేకపోవడంతో అధికారంలోకి వచ్చిన పాలకులు, వారికి ఇష్ట మొచ్చిన రీతిలో గణాంకాలు చెబుతూ వస్తున్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఇటువంటి పరిస్థితి ఉండదని ఆయా కులసంఘాల నాయకులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. కులగణన ద్వారా ప్రతి కుటుంబ వివరాలను పొందుపరచనున్నారు. ఏయే కులాలకు సంబంధించి ఎంత మంది ఉన్నారు, స్త్రీ, పురుషులు తదితర వివరాలు తెలియనున్నాయి. అంతేగాకుండా విద్య, ఉద్యోగం, చట్టసభల్లో వెనకబడిన వర్గాలకు ఇది మంచి అవకాశం. ప్రభుత్వం నుంచి ఏ సామాజిక వర్గానికి రావాల్సిన వాటా ఎంత, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అందాల్సినది ఎంత అనే దానిపై స్పష్టత రానుంది.

### కులగణన చేపట్టడం హర్షం



ఎన్నో ఏళ్ల క్రితం నిలిచిపోయిన కులగణను చేపట్టేందుకు జగనన్న చర్యలు తీసుకోవడంపై 139 కులాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈనెల 15వ తేదీ నుంచి కార్యక్రమం ప్రారంభమైంది. గతంలో రెండు మాత్రమే కుల గణన జరిగింది. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డితోనే కులగణన సాధ్యమయ్యింది. 139 కులాల్లో ఎవరెంత మంది ఉన్నారు. ఎవరికి ఎంత రిజర్వేషన్ ఉంటుందనేది స్పష్టంగా వెల్లడవుతుంది.

– డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్సీ

### మంచి నిర్ణయం



కులగణన ద్వారా విద్య, ఉద్యోగాలు, చట్టసభల రిజర్వేషన్‌పై పూర్తి స్పష్టత వస్తుంది. కులాల వారీగా జనాభా వివరాలు వెల్లడైతే ఏ వర్గం ఆర్థికంగా వెనుకబడి ఉంది. ఎవరికి ఎంత మేర రిజర్వేషన్ ఇవ్వాలని, ప్రస్తుతం ఎంత ఉందనే వాటిపై ప్రభుత్వాలకు అవగాహన వస్తుంది. ఈ నిర్ణయం ద్వారా వెనుకబడిన వర్గాలకు ఎంతో మంచి జరుగుతుంది. కులగణన చేపట్టేందుకు నిర్ణయించడం శుభపరిణామం.

– డాక్టర్ కృష్ణమూర్తి

## బోధనలో నాణ్యత పెంచాలి

- ఎస్ఎస్ఏ ఏపీసీ వేణుగోపాల్



బోధిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ వేణుగోపాల్

కృష్ణగిరి: బాలికలకు నాణ్యమైన విద్య సాధ్యమయ్యేలా, అందుబాటులో ఉండేలా చేయడమే కస్తూర్బా విద్యాలయాల (కేజీబీవీ) లక్ష్యమని, అందుకు తగ్గ బోధన అందించాలని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ ఉపాధ్యాయినులను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక కేజీబీవీ పాఠశాలను జీసీడీఓ సునీత, ఐటీ కోఆర్డినేటర్ సాయితో కలిసి తనిఖీ చేశారు. బాలికలకు అందుతున్న భోజన మెనూ, సౌకర్యాలను పరిశీలించారు. డిజిటల్ విద్యాబోధనను తరగతుల వారీగా పరిశీలిస్తూ, ఐఎఫ్‌పీల ద్వారా అర్థమయ్యేరీతిలో బోధన కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయినులతో సమావేశమై బాలికలలో విద్యా ప్రమాణాలు పెంచాలని, అందుకు తగ్గ ప్రణాళికతో సాగాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడునేడు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎస్‌ఓ చైతన్య స్రవంతి, డీటీపీ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



రణమండల కొండలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: కార్తీక మాసం మొదటి శని వారం సందర్భంగా పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి, విశేష పూజలు జరిపించారు.

కోసిగి: స్థానిక కడపాళెం వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో వచ్చే నెల 13వ తేదీ వరకు కార్తీక మాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. శనివారం వేకువజాము నుంచి అర్చకులు దుర్గా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, వెండి కవచ అలంకరణ, ఆకు పూజలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నెలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామికి తెల్లవారుజామున అర్చకులు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు.

# జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి







కుంబళనూరు క్యాంపులో ప్రచారం దృశ్యం, కౌతాళంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ , లింగాలదిన్నెలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కౌతాళం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలోని ఉప్పర్‌వీధిలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పథకాల వల్ల కల్గిన ప్రయోజనాన్ని వివరించారు. కుంబళనూరు క్యాంపులో ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, బుచ్చిరాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ నగర్‌లో జెడ్పీ పాఠశాల పీఎంసీ చైర్మన్ వడ్డెరాము, వికలాంగుల సంఘం అధ్యక్షుడు షేక్షావలి, రాజ్‌అహ్మద్ అధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి లబ్ధి గురించి తెలియజేశారు. చక్రవర్తి, నరసింహులు, వెంకప్ప పాల్గొన్నారు.

**రాష్ట్రానికి జగనన్న అవసరం..**

రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ ఎంతో అవసరమని, వచ్చే ఎన్నికల్లో ఆయనను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటేనే పథకాలు, అభివృద్ధి కొనసాగుతుందని ఎంపీపీ అమరేష్, లింగాలదిన్నె సర్పంచ్ వీరభద్ర గౌడ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని లింగాలదిన్నెలో నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును గ్రామ నాయకులతో కలసి ఆవిష్కరించారు.సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## సూగూరులో త్వరలో అభివృద్ధి పనులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం: మండలంలోని సూగూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ 20 లక్షలతో త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు.శనివారం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు మంజూరైన సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకుని బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రా మంలో పర్యటించిన సమయంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారించాలని అధికారులను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఎంపీడీఓ మణిమంజరీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, ఏపీఓ తిమ్మారెడ్డి, ఏఓ జీరాగణేష్, ఏపీఎం జయశ్రీ,మండల స్థాయి అధికారులు ఉన్నారు.

**పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి బూత్ కన్వీనర్లకు సూచించారు. శనివారం మండలంలోని సూగూరు గ్రామంలో నిర్వహించిన ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మారెమ్మవ్వ గుడి సమీపంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు ప్రత్యక్షంగా,పరోక్షంగా అందించిన వెల్ఫేర్ స్కీంలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జి.భీమారెడ్డి తదితరులు ఉన్నారు.

### ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోనిరూరల్: కండి దస్తగిరిని కులం పేరుతో దూషించడంతో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన కండి దస్తగిరిపై పాండవగల్ గ్రామానికి చెందిన బోయ రామయ్య, బోయ దేవేంద్ర, బోయ హనుమంతరెడ్డి దాడి చేసి కులం పేరుతో దూషించడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పాండవగల్–ఇస్వీ గ్రామాల మధ్యనున్న పొలాల్లో కండి దస్తగిరి ఈనెల 17న రాత్రి ఎద్దులతో ఇంటికెళ్తుండగా ఎద్దులు బెదిరి బోయ రామయ్య పొలంలోకి దూకాయి. అక్కడే ఉన్న బోయ రామయ్య, బోయ దేవేంద్ర, బోయ హనుమంతరెడ్డి మా పొలంలోకి ఎద్దులను విడుస్తావా అని దుర్భాషలాడుతూ కట్టెలతో దాడి చేశారు. గాయపడిన ఆయన ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

### గ్యాస్ సిలిండర్ లీకై మహిళకు గాయాలు

ఆలూరు రూరల్: గ్యాస్ సిలిండర్ లీకై మహిళకు తీవ్రమైన కాలిన గాయాలయ్యాయి. మండలంలోని కురువళ్లి గ్రామానికి చెందిన సురేష్ భార్య లక్ష్మి శనివారం సాయంత్రం వంట చేస్తుండగా సిలీండర్ లీకై చీరకు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. డాక్టర్లు ప్రథమ చికిత్స అందించారు. 80 శాతం కాలిన కాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త సురేష్, భార్య లక్ష్మి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం.

### మోదీ చిత్రం ఏర్పాటు చేయాలి

ఆదోనిఅర్బన్: రేషన్ పంపిణీ వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం జిల్లా నాయకులు అంజయ్‌కుమార్, మణికంఠ కోరారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు కాశీ విశ్వనాథ్,రాహుల్‌చవాన్,ఉదయ్,వినోద్ పాల్గొన్నారు.

### ఐటీఐలో షార్ట్‌టర్మ్ కోర్సులు

ఆలూరు రూరల్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉచిత షార్ట్‌టర్మ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సూరప్ప శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కోర్సు కాలపరిమితి 3 నెలల ఉంటుందని, రోజుకు నాలుగు గంటల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఈ కోర్సుకు అర్హులని, ఆసక్తిగల వారు పదో తరగతి మార్కులిస్టు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం మూడు పాస్‌పోస్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు ఫోన్ 6302095090, 9949581102 నంబర్లకు కాల్ చేయాలన్నారు.

## టీబీ డ్యాంలో రోజు రోజుకు తగ్గుతున్న నీటిమట్టం



టీబీ డ్యాంలో తగ్గిన నీటి మట్టం

హొళగుంద: ఉమ్మడి జలాశయం కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ రోజు రోజుకు తగ్గుతోంది. ఈ ఏడాది నెలల తరబడి నీటి చేరిక (ఇన్‌ఫ్లో) లేకపోవడంతో వేగంగా నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. శనివారం 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను కేవలం 22 టీఎంసీలు మాత్రమే నిరు నిల్వ ఉండి ఇన్‌ఫ్లో 316 క్యూసెక్కులుంది. దీంతో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు ఈ నెలాఖరు వరకు మాత్రమే నీరు వదలనున్నారు. టీబీ డ్యాంలో గతేడాది ఇదే సమయానికి 98 టీఎంసీల నీరు ఉండి 3,857 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 1,633 అడుగులకు గాను 1,631 అడుగుల వద నీరు నిల్వ ఉండేది. ఎల్లెల్సీ ఆంధ్రలో 250 కి.మీ వద్ద 675 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

## జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోనిరూరల్: వచ్చే నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక కోర్టు సమావేశ భవనంలో బీమా కంపెనీల మేనేజర్లు, అడ్వకేట్లు, చిట్‌ఫండ్ కంపెనీల మేనేజర్‌లు, అడ్వకేట్స్ ఫైనాన్స్ కంపెనీ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను అడిగి తెలుసుకున్నారు. అడ్వకేట్లు గిరిధర్, సి.ఆనంద్, ఏజీపీ ఎస్.అంజనప్ప ఉన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, సింహం నాగేంద్ర

ఆదోనిటౌన్:టీడీపీ నాయకులు ఊరూరా తిరుగుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, మాజీ కౌన్సిలర్ సింహం నాగేంద్ర మండిపడ్డారు. ఏ రాష్ట్రంలోనూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. ఆదోనిలో ఆ పార్టీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బురద జల్లడమే టీడీపీ శ్రేణులు పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. అధికార పార్టీ నేతలు అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ ప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని ఆరోపించారు. స్కిల్ స్కాం కేసులో సీఐడీ అరెస్ట్ చేస్తే తమ పార్టీకి ఆపాదించడం దుర్మార్గమన్నారు. అక్రమాలు నిజం కావడంతోనే కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని చెప్పారు. నిధుల దారి మళ్లింపు నిజం కాకపోతే కోర్టులు చర్యలు తీసుకోవు కదా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు రామ్‌దాసు, తాయన్న పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం



సహస్రనామ పారాయణంలో పాల్గొన్న మహిళలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఫారెస్ట్‌లైన్‌లో నున్న అంబాభవానీ దేవస్థానంలో శనివారం లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా దేవస్థాన సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 300 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు



గన్నీ బ్యాగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మురళీమోహన్

ఆదోని సెంట్రల్: పట్టణంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో.. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయా పాఠశాలల విద్యార్థులకు ఆట ల పోటీలు నిర్వహించారు.గ్రంథాలయాధికారిణి సుజాత మాట్లాడుతూ నెహ్రూ, చిన్మయి, మిల్టన్, భాష్యం పాఠశాలలతో పాటు గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, నెహ్రూ, ఇందిరాగాంధీపై వక్తృత్వపు, క్విజ్, వివిధ రకాల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. రిటైర్డ్ హెచ్ఎం దేవప్రసాద్, రిటైర్డ్ అధ్యాపకులు ఈరన్న, రికార్డు అసిస్టెంట్ దేవేంద్ర పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో పుస్తక ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గ్రంథాలయ భవనంలో 21వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి పుస్తకాలను చదివి దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. లైబ్రేరియన్ వేణుగోపాల్, సహాయ లైబ్రేరియన్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోసిగి: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి దుల్లయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడకారులకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ కోచ్ గంగప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండలంలోని జాలవాడి గ్రామ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భా నిర్వహించిన వివిధ రకాల ఆటలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం విక్టోరియమ్మ ఆధ్వర్యంలో లైబ్రేరియన్ ఆశాజ్యోతి శనివారం బహుమతులు అందజేశారు.

## ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి



లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయిని

కోసిగి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని స్త్రీ శక్తి దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం నాగేశ్వరి దేవి , ఏబీవీపీ మంత్రాలయం తాలూకా బాగ్ కన్వీనర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీబాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆమె కీలక పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థినిలు పురందేశ్వరి, రమాదేవి, సాయి జ్యోతికి బహుమతులు అందజేశారు. ఏబీవీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్ నాయుడు, నాయకులు వెంకటేష్, హుసేని, వీరేష్, సుజేంద్ర, ఆదెప్ప, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## జాబితా తయారీలో జాగ్రత్తలు పాటించండి



రైతుల జాబితా తయారీపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు : 2023 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతుల జాబితా రూపొందించడంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ సూచించారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో శనివారం పంట నష్టపోయిన రైతుల జాబితా తయారీపై ఆర్బీకే సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఏఓ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా రైతుభరోసా కేంద్ర సిబ్బంది, వీఆర్‌ఓలు పంట నష్టపోయిన వారి జాబితాను తయారు చేయాలన్నారు. అలా తయారు చేసిన జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామని చెప్పారు. రైతుల బ్యాంక్ ఖాతాలు, ఆధార్ వివరాలు సేకరించాలని గ్రామ వలంటీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రాలయం ఉద్యాన శాఖాధికారి హరీంద్ర పాల్గొన్నారు.